మినీకథ

# స్పెషల్ పాలిష్

పి.వి.రవికుమార్



ఉదయం పది గంటలయింది. తిరుపతి రైల్వేస్టేషన్లో ఆరో నెంబర్ ప్లాట్‌ఫాం నుంచి బయలుదేరడానికి సిద్ధంగా వున్న పూరీ ఎక్స్‌ప్రెస్ రెండవ తరగతి పెట్టెలో ఓ కిటికీ దగ్గర కూర్చున్న నేను. రేపు జరగనున్న ఇంటర్వ్యూ గురించి ఆలోచిస్తున్నాను. ఈ రోజు విజయవాడలో రాత్రి ఎలా గడపాలో రేపు ఏ బండికి బయలుదేరాలో ఆలోచిస్తుండగా రైలు కదిలింది. నేను ఇంకా ఎవరెవరు ప్రయాణిస్తున్నారో చూడాలని తల తిప్పాను. ఇద్దరు పోలీసు కానిస్టేబుల్స్ ఉన్నారు. వాళ్ళు గట్టిగా మాట్లాడుతున్నారు. నాకు వాళ్ళ మాటలు బోరనిపించి, పెట్టెలో నుంచి మేగజైన్ తీశాను. ఇంతలో రేణిగుంట స్టేషన్ వచ్చింది. ఇరవై నిమిషాల తర్వాత బండి బయలుదేరింది. ఇంతలో నా దగ్గరికి ఓ కుర్రాడు వచ్చి.

"సార్! బూట్ పాలీ సేత్తాను" అన్నాడు. నేను తిరుపతిలో చేయించుకోవడం మర్చిపోవడంవల్ల, బూట్లు తీసి వాడికిచ్చాను. వాడు పాలిష్ చేశాక "పావలా" అన్నాడు. నేను యిచ్చాను. ఆ కానిస్టేబుల్స్‌లో ఒకడు, కుర్రాడిని అధికారంగా "రేయ్, ఇట్రారా" అన్నాడు. ఆ కుర్రాడు దగ్గరి కెళ్ళాక, "నాక్కూడా చెయ్‌రా" అన్నాడు. ఆ కుర్రాడికి డబ్బులు యిస్తాడో లేదోనని అనుమానం వేసించిలా వుంది. "పావలా" అన్నాడు. ఆ పోలీసు పక్కనున్న మరో పోలీసుతో "నా కొడుక్కి డబ్బు౦ట్రా" అని, కుర్రోడితో "సెయ్యరా" అని కూర్చున్న ఆ కుర్రోడి తొడ మీద కాలు పెట్టాడు. నాకు మనస్సు చివుక్కుమంది. ఏదో అడుగుదామని పోలీసోళ్ళతో ఎందుకని ఊరుకున్నాను. కుర్రాడు నాకు పాలీష్ చేసిన డబ్బా కాకుండా, మరో క్రొత్త డబ్బాతీసి పోలీసుకి చెయ్యసాగాడు. నాకు కోపం వచ్చింది. నాకు పాత పాలీష్ వేశాడని అనుమానం వేసింది. సర్లే, ఎలాగూ పోలీసు డబ్బివ్వడుగా, అప్పుడే ఆ కుర్రాడి రోగం కుదురుతుందని వూరుకున్నాను. ఇంతలో పాలీష్ వేశాక పోలీసుచేత తిట్లు తిని, ఆ కుర్రాడు వెళ్ళిపోయాడు. నేను కొద్దిసేపటికి బాత్‌రూం వైపెళ్ళాను. అక్కడ, ఇందాక నాకు పాలిష్ చేసిన కుర్రాడు మరో కుర్రాడితో ఏదో అంటున్నాడు రహస్యంగా. నేను జాగ్రత్తగా విన్నాను. పాలీష్ కుర్రాడు "ఒరేయ్ రంగా! అదో పోలీసోడు, నాకాడ పాలీ సేయించుకొని, డబ్బు లీలేద్రా. అట్టాటి నాకొడుకుల కోసం చేసుంచానే- రైలు బండి సెక్రాల నుంచి తీసిన గ్రీసు "పెసల్ పాలీసు" తీసి వేశాను. ఇక చూడు నాసామిరంగా అది వదలాలంటే వాడెబ్బ దిగిరావాల. ఆ బూటు తోలూడిపోతాది" అని చెప్పి, గొల్లున నవ్వి, నన్ను చూసి, నేనెక్కడ పోలీసోళ్ళతో చెప్తానో అని భయపడిపోయాడు. నేను నవ్వి, చెప్పనని తలవూపి, బాత్‌రూం కెళ్ళి నాసీట్లో కొచ్చి కూర్చున్నాను. ఇంతసేపూ మాట్లాడుతూనేవున్న పోలీసోళ్ళని చూసి, ఒకడి బూట్లు చూసి, నవ్వాపుకోలేక, వారపత్రిక అడ్డుపెట్టుకుని నవ్వేశాను. ●